కర్నూలు | నంద్యాల
వార్త
1 మే , 2024 బుధవారం పేజీలు 4

# ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీలకు 50 సంవత్సరాలు దాటితే రూ.4 వేలు పెన్షన్

**- కర్నూలు టిడిపి అభ్యర్థి టీజీ భరత్**

**కర్నూలు న్యూసిటి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** ఎస్సీ,ఎస్టీ, బిసి మైనార్టీలకు 50 సంవత్సరాలు దాటితే రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. నగరంలోని 16వ వార్డు పరిధిలోని స్వామిరెడ్డి నగర్‌లో ఆయన టీజీ భరత్ భరోసా యాత్ర పేరుతో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచుతున్నామని 100 శాతం అంగవైకల్యం ఉంటే రూ.15 వేలు అందిస్తామన్నారు. ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. ప్రతి పేద కుటుంబాన్ని సంపన్నులుగా మార్చేందుకు తమ తెలుగుదేశం ప్రభుత్వంలో కృషిచేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని హామి ఇచ్చారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలకు రూ.10 లక్షల సబ్సిడీ ఇస్తామని చెప్పారు. యువతకు ప్రతి సంవత్సరం 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కర్నూలులో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే స్థానికంగా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు తప్పకుండా కృషిచేస్తానని యువతకు భరోసా ఇచ్చారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తాను ముందుంటానన్నారు. ఉచిత ఇసుక విధానం తీసుకువచ్చి భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వారందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఇక అర్హులందరికి సంక్షేమ పథకాలు అందాలంటే కర్నూలులో తాను ఎమ్మెల్యేగా



ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులకు ఇళ్లు, ఇళ్ళపట్టాలు అందించే బాధ్యత తాను తీసుకుంటానని భరత్ చెప్పారు. ఈకార్యక్రమంలో నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, సీనియర్ నేతలు రామాంజనేయులు, బాబ్జి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నిపుల బాటలో నడుస్తున్న.. నంద్యాల యువత

**నంద్యాల 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత్తలు**



**నంద్యాల, ఏప్రిల్ 30,ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి కాలం అంటే గతంలో సాదారణంగా 30నుండి 36 డిగ్రీల ఉష్ణోగ్రత్తలకే పరిమితం అయ్యేది కాని.. ఈ ఏడాది మార్చి నుండే ఎండ తీవ్రత అదికంగా ఉంది. ముఖ్యంగా దేశంలో అత్యదిక ఉష్ణోగ్రత్తలు మన రాష్ట్రంలోనే అదికంగా నమోదు అవుతున్నాయి. అందులో కూడ నంద్యాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానములో నిలిచింది ఉదయం 10 నుండే నిప్పుల మీద నడిచి నట్లు అనిపిస్తుంది, నంద్యాల్లో ఉన్న జనం 10గంటలు దాటితే ఇళ్లకే పరిమితం అవుతున్నారు. యవత మాత్రం బయట తిరిగిన నిప్పు బాటల్లో నడుస్తు నానా అవస్థలు పడుతున్నారు. ఇక మద్య వయస్సు ఉన్న వారు మాత్రం 10గంటలు దాటితే చాలు ఇళ్లలో కులరులు, ఎసిలతో కాలం వెల్ల దీస్తున్నారు. దీనికి తోడు 2024 ఎన్నికల కురుక్షేత్రం కావడం నాయకులు కూడా 6గంటల నుండే జనంలోకి వెల్లి తమకు మద్దత్తు ఇవ్వాలని కోరుతున్నారు. కొందరు మాత్రం 1గంట వరకు ప్రచారం చేస్తున్నారు. కొందరు 11గంటలకే ముగించుకుని తిరిగి సాయంత్రం 4గంటల తరావ్త ప్రచారంనకు వెళ్లుతున్నారు మంగలవారం నంద్యాల్లో 11గంటలకే 45 డిగ్రీలు దాటంతో జనం విల విలాడారు. ముఖ్యంగా యువత కూల్ వాటరు బాటిల్స్‌తో చల్లటి నీటితో ముఖం మీద పోసుకుంటు వీదుల్లో తమ పనులు చూసుకుంటున్నారు. అలాగే మహిళలు ఒకరి కొకరు సహాయంఅంటు తమ చున్నీలకు కప్పు కుని పనులు చూసు కుంటున్నారు. మొత్తం మీద నంద్యాల నిప్పుల కొలిమి అయిందని చెప్పాలి.



# మాండ్ర త్యాగం.. మరువలేం..!

**● భవిష్యత్‌లో మాండ్రకు సముచిత స్థానం**
**: తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు**



**నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి త్యాగం మరువలేమని ... భవిష్యత్‌లో మాండ్రకు సముచిత స్థానం కల్పిస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అన్నారు. ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా సోమవారం నందికొట్కూరులో నిర్వహించిన బహిరంగసభకు హాజరైన చంద్రబాబు మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో బస చేశారు. మంగళవారం ఉదయం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ..**

**నందికొట్కూరుటౌన్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** పార్టీ పటిష్టత కోసం నందికొట్కూరు నియోజకవర్గంలో మాండ్ర శివానందరెడ్డి కృషి చేశారని, ఆయనకు మరింత పేరు తేవాలంటే నాయకులు, కార్యకర్తలు ఈ ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పని చేసి తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరికి భారీ మెజారిటీ వచ్చేలా పని చేయాలన్నారు. రాబోయే రోజుల్లో తెదేపా పాలనలో మాండ్ర శివానందరెడ్డి పనితీరుకు గుర్తింపు ఉంటుందనడంతో తెదేపా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని సైకో ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఓడించడానికి అక్రమ మార్గం



ఎంచుకున్నారన్నారు. రాష్ట్రంలోని ఆయా నియోజకవర్గాల్లో జనసేన పార్టీ గుర్తు అయిన గాజు గ్లాసు గుర్తును స్వతంత్ర్య, రెబల్ అభ్యర్థులు పొందేలా ప్రణాళిక రూపొందించారన్నారు. ఈ విషయాన్ని కూటమి నాయకులు గుర్తించి ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వైసీపీ మ్యానిఫెస్టో తేలిపోయిందని, తెదేపా అమలు చేసే సూపర్ 6 పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తెదేపా అభ్యర్థులను గెలిపించుకోవాలని చంద్రబాబు సూచించారు. అంతకు ముందుగా నందికొట్కూరు నియోజకవర్గ తెదేపా మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులను మాండ్ర శివానందరెడ్డి, మాండ్ర లింగారెడ్డిలు చంద్రబాబుకు పరిచయం చేశారు. అనంతరం మాండ్ర స్వగృహం నుంచి ప్రత్యేక వాహనంలో చంద్రబాబునాయుడు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్‌లో అమరావతికి వెళ్లారు. మాండ్ర కుటుంబ సభ్యులంతా కలిసి చంద్రబాబుకు సెండ్‌ఆఫ్ ఇచ్చారు. అనంతరం మాండ్ర శివానందరెడ్డి పార్టీ మాట్లాడుతూ ప్రజాగళం విజయవంతం చేసేందుకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, మాజీ ఎంపీపీ వీరం ప్రసాదరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గుండం రమణారెడ్డి, కౌన్సిలర్లు జాకీర్‌బాష, రబ్బాని, భాస్కరరెడ్డి, నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, కాతా రమేష్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, మొహిద్దీన్, శెట్టి రవికుమార్, ముర్తుజావలి, ఇఎం.సురేంద్ర, జాకీర్‌బాష, జమీల్, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీమఠం హుండీ ఆదాయం రూ.2.71 కోట్లు

**మంత్రాలయం,ఏప్రిల్ 30,ప్రభాతవార్త:** దక్షిణ భారతదేశంలో రెండవ తిరుపతిగా పేరుగాంచిన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఏప్రిల్ నెలకు గాను రూ.2,71,83,973 హుండీఆదాయం వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె శ్రీనివాసరావు మంగళవారం విలేకరులకు తెలిపారు.33 రోజులకు గాను ఈ హుండీ ఆదాయం వచ్చినట్లు చెప్పారు.ఇందులో బంగారం 41,గ్రాములు,వెండి 1290 గ్రాములు భక్తులు కానుకల రూపంలో సమర్పించినట్లు వెల్లడించారు.ఈ హుండీ ఆదాయాన్ని శ్రీమఠం బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు.

# ఉమ్మడి జిల్లాల్లో ఎన్డియే కూటమి అత్యధిక స్థానాల్లో.. గెలువడం ఖాయం

**కర్నూలు విద్య, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఎన్డియే కూటమి అత్యధిక స్థానాలు గెలువడం ఖాయమని భారతీయ జనతాపార్టీ కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును కోడుమూరు నియోజకవర్గం గూడూరులో కలిసిన సందర్భంలో నగరూరు మాట్లాడుతూ ఎన్డియే కూటమి అభ్యర్థుల విజయానికి తమ వంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# ఓటు వేయాలంటే ఈ గుర్తింపు.. పత్రాలు ఉండాల్సిందే

***రాష్ట్రంలో ఎన్నికల కాలం నడుస్తుంది. పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికలకు ఇక కేవలం 12 రోజులు మాత్రమే మే 13వ తేది నిర్వహించే అసెంబ్లీ లోక్ సభ ఎన్నికల్లో ఓటు లిస్టుల్లో పేరు ఉన్నప్పటికి ఓటు వేయాలంటే గుర్తింపు పత్రాలు ఖచ్చితంగా ఉండాల్సిందే అని ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఉత్తర్వులు జారీచేసింది.***

**నంద్యాల విద్య, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** పోలింగ్ కేంద్రంలోకి ఓటు వెళ్లె ముందు గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి తీసుకెళ్లాల్సిన అవశ్యకత ఉంది. ఇందులో ఓటరు గుర్తింపు కార్డు, అధార్‌కార్డు, పాన్‌కార్డు ప్రత్యేక వైకల్యం కలిగిన ఐడి కార్డు, సేవా గుర్తింపు కార్డు బ్యాంకు, పోస్టాఫీసు పాసు బుక్కులు, ఆరోగ్యభీమా, స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పాస్‌పోర్టు, ఎన్‌పిఆర్ కింద ఆర్టీఐ జారీచేసిన స్మార్ట్ కార్డు, పెన్షన్ డాకుమెంటు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధికారులు జారీచేసిన ప్రత్యేక గుర్తింపుకార్డులు ఉపాధి జాబ్‌కార్డులలో ఏదైనా కార్డును చూపించి ఓటు వేయాల్సిన అవశ్యకతను ఎన్నికల కమిషన్ సూచించింది. ఎన్నికల్లో అధికశాతం ఓటింగ్ పాల్గొనేందుకు ప్రజల్లో కూడ అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని సూచించారు.


# ఎన్నికల విధుల్లో సిబ్బందికి ఏవరు భోజనాలు పెట్టాల్సిన అవసరం లేదు

**- ఎన్నికల కమిషన్ భోజన ఏర్పాట్లకు నిధులు విడుదల**

**నంద్యాల విద్య, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** జరగబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈనెల 12, 13 తేదిల్లో ఎన్నికల అధికారులు విధుల్లో పాల్గొనున్నారు. 13న పోలింగ్ నిర్వహిస్తున్నప్పటికి సంబంధిత పోలింగ్ మెటీరియల్ తీసుకోవడానికి వారికి కేటాయించిన కార్యాలయాలకు వెళ్లెందుకు 12న హాజరుకావాల్సి ఉంటుంది. అయితే ఈ ఎన్నికల్లో పాల్గొనే పీఓ, ఏపీఓ, ఓపీఓ సిబ్బందికి ఎన్నికల కమిషన్ భోజనాలు ఏర్పాటుచేస్తు ఒక్కొక్కరికి నిధులను విడుదల చేస్తు రాష్ట్ర ఎన్నికల అధికారి ఉత్తర్వులు 3476ఎన్నికలు సి/23 మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల ఉన్నతాధికారులు సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేయాలని అదేశించారు. అయా మండల విద్యాశాఖాధికారుల ద్వారా ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 12 మందికి వారి ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.330 చొప్పున నిధులు మంజూరు చేశారు. ఎన్నికల సిబ్బందికి మెనును ఈవిధంగా ఇవ్వాలని అదేశించారు. 12వ తేది రాత్రి మిర్చి బజ్జీ, టీ, రాత్రి భోజనం, అరటిపండు, పప్పు, సాంబారు, రసం కూరగాయతో భోజనం ఏర్పాటు చేయాలని పోలింగ్ రోజు ఉదయం టిఫిన్, ఉప్మా, లేదా ఉగ్గాని బజ్జీ, 11 గంటలకు టీ ఏర్పాటు చేయాలని, మధ్యాహ్నం భోజనం అరటిపండు,సాంబారు, రసం, పప్పు, కూరగాయ, పెరుగు అమర్చాలని మెను జారీచేశారు. దీనికి ఎన్నికల కమిషన్ నిధులను విడుదల చేసింది.

# టిడిపిలో.. మూడు ముక్కలాట..!

**: అధిపత్యపోరులో మూడు వర్గాల నేతలు**
**: రగులుతున్నబూత్ ఇన్‌చార్జీల నియమకాల వివాదాలు**
**: పరస్పర దాడులకు దిగుతున్న అనుచరులు**
**: నివారణ చర్యలు తీసుకోకపోతే పంచర్ తప్పదు**



**ప్యాపిలి ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** రాజకీయాలు చేయడం నాయకులకు కత్తిమీదసాముగా మారింది. ఎవ్వరికి చెప్పలేక..ఎవ్వరిని వదులుకోలేక కక్కలేక మింగలేని నాయకులు సతమతమవుతున్నారు. అసలే ఎన్నికల సమయంలో విడవమంటే పాముకు కోపం..కరవమంటే కప్పకు కోపం అన్నరీతిలో ద్వితీయ శ్రేణి నాయకుల వ్యవహారాలు అగ్రనేతలకు మింగుడు పడని అంశంగా మారుతున్నాయి. రాజకీయ ఉద్దండులు రాజకీయ ప్రాతినిధ్యం వహించిన డోన్ నియోజకవర్గంలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. నియోజకవర్గంలోని ప్యాపిలి మండలంలో రాజకీయ పరిణామాలు మారిపోతున్నాయి. గతంలో మండలంలో కెయి, కోట్ల వర్గాలు ఉండేవి. ప్రస్తుతం రెండు వర్గాలు కలిసిపోయి రాజకీయాలలో సంచలనం సృష్టించారు. దీనికి తోడు కొత్తగా మండలంలో ధర్మారం సుబ్బారెడ్డి వర్గీయులుగా కొంతమంది చెలామణి అవుతున్నారు. బలమైన కోట్ల, కెయి వర్గాలకు దీటుగా ధర్మారం వర్గీయులు లేక పోయినప్పటికి వివాదాలకు కేంద్రబిందువులుగా మారుతునాన్నరు. గత నాలుగు రోజుల క్రితం ప్యాపిలి టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకుల మధ్య వాదోపవాదాలు జరిగి పరస్పరం దాడులు చేసుకున్న సంఘటన జరిగింది. బూత్ ఇన్‌చార్జ్‌గా నియమించిన ధర్మారం సుబ్బారెడ్డి వర్గానికి చెందిన నేతకు సహకరించమని కెయి వర్గీయులైన మాజీ జడ్పిటిసి, మాజీ ఎంపిపి వర్గ నేతలు చెప్పడంతో వివాదం చెలరేగింది. దీనితో ఇరువర్గాల నేతల మధ్య వాదోపవాదాలు పెరిగి జరిగిన దాడులలో ధర్మారం సోదరుడు గాయపడిన సంఘటన జరిగింది. ఘర్షణను నివారించడానికి యత్నించిన వారు గాయపడ్డారు. గతంలో కూడ టిడిపి కార్యాలయం ప్రారంభోత్సవ ప్లెక్సి విషయంలో కెయి వర్గీయుల మధ్య జరిగిన గొడవలు చర్చనీయాంశంగా మారి సంచలనంగా మారింది. ధర్మారం సోదరునిపై జరిగిన దాడికి ప్రతీకారంగా డోన్‌లో నివసిస్తున్న ప్యాపిలి నేతపై దాడికి ప్రయత్నించారు. టిడిపికి కంచుకోటగా నిలిచిన ప్యాపిలి మండలంలో పచ్చనేతల మధ్య నెలకొన్న వర్గపోరు శాపంగా మారి ప్రత్యర్థులకు లాభసాటిగా మారుతున్నది, టిడిపికి కీలకమైన ఎన్నికలలో సమన్వయంతో వ్యవహరించాల్సిన నాయకులు పరస్పరం దాడులు, వివాదాలకు పాల్పడటం సైకిల్‌కు నష్టం కలిగించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైన టిడిపి అగ్రనేతలు జోక్యం చేసుకుని వర్గపోరును నివారించక పోతే సైకిల్‌కు ఫంచర్ తప్పదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# షాట్ సర్క్యూట్ ప్రమాద స్థలాన్ని సందర్శించిన రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్

**కర్నూలు విద్య, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** నగరంలోని అబ్దుల్లా ఖాన్ ఏస్టేట్ నందు సోమవారం విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి దెబ్బతిన్న డ్రెస్‌సర్కిల్ రేమాండ్స్ షోరూం ప్రాంతాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన ఘటనతీరును జరిగిన నష్టాన్ని ఆయన షోరూం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో అగ్నిమాపక సిబ్బంది రావడం వల్ల పెనుప్రమాదం తప్పిందని లేదంటే భారీ నష్టం జరిగి



వుండేదని షాపుల నిర్వాహకులు టీజీ వెంకటేష్‌కు తెలిపారు. అగ్నిప్రమాదాన్ని సకాలంలో గుర్తించి అగ్నిమాపకసిబ్బందికి వెంటనే సమాచారం ఇవ్వడం చాల మంచింది అయిందని టీజీ వెంకటేష్ అన్నారు. లేనియెడల ప్రమాదంలో అస్తినష్టంతో పాటు షోరూంలో పనిచేస్తున్న సిబ్బంది కూడ ఎంతగానో ఇబ్బంది పడాల్సి వచ్చేందని ఆయన అన్నారు. ఏది ఏమైనా నిత్యం రద్దీగా వున్నటువంటి ఈప్రాంతంలో ఇటువంటి ప్రమాదాలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో డ్రస్ సర్కిల్ రెమాండ్స్ షోరూంల అధినేతలు గోపాల్‌రెడ్డి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రమట్టిని.. తొడేస్తున్నారు ..!

**- నిషేదానికి .. తూట్లు ...!!**

**- అనుమతుల్లేకుండా యథేశ్చగా తరలింపు**



**కర్నూలు రూరల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా మట్టి తవ్వకాలపై నిషేదం ఉన్నప్పటికీ .. ఆ నిషేదాలకు తూట్లు పొడిచి యథేశ్చగా ఎర్రమట్టిని తరలిస్తూ సొమ్ముచే సుకుంటున్న విషయం వెలుగులోకి వచ్చింది. మట్టి తవ్వకాలపై ఉన్న నిషేదాలను పకడ్బందీగా అమలుపరాచల్సిన అధికారులు గాలికొదిలేశారు. దీంతో సహజవనరునలపై మట్టి మాఫియా కన్నుపడింది. పట్టపగలే కొండలను పిండి చేస్తున్నారు. వీటిపై సంబంధిత అధికారుల నుంచి ఏలాంటి చర్యలు లేక పోవడంతో మట్టి మాఫియాదారులకు అడ్డుఅదుపుల్లేకుండా పోయింది.దీంతో పట్టపగలే ప్రతి రోజు వందలాది భారీ వాహనాల ద్వారా ఎర్రమట్టిని తరలిస్తున్న మట్టి మాఫియాపై ప్రత్యేక కథనం. వివరాలోకి ... కర్నూలు మండలం గార్గేయపురం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 751,180 కింద ఉన్న ప్రభుత్వానికి చెందిన భూములపై గత వారం రోజుల నుంచి ఎర్రమట్టిని తరలించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని నూతనపల్లే పరిసర ప్రాంతాలల్లో కూడా ఎర్రమట్టి తవ్వకాలు యథేశ్చగా సాగుతోంది. అదే విధంగా ఈ వ్యాపారాలు మరింత సులువుగా ఉండేందుకు మాఫియా దారులు రైతుల దగ్గర ఉన్న భూములను చదును చేస్తామనే సాకుతో ఆ భూముల నుంచి ఎర్రమట్టిని తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇలాంటి వాటికి కూడా అధికారుల నుంచి తప్పని సరిగా అనుమతులుండాల్సేందే. ఇక్కడి నుంచి తరలించుకొని పోతున్న ఎర్రమట్టిని మట్టి మాఫియాదారులు రియల్టర్లు వేసుకున్న వేంచర్ల స్థలాల్లోకి వెలుతొంది. కొండలను పిండి చేసి మట్టిని తరలిస్తున్నా వాటికి ఎలాంటి అనుమతుల్లేవు. మట్టి తవ్వకాలపై అధికారుల నుంచి నామమాత్రపు కూడా చర్యలు లేక పోవడంతో మట్టి మాఫియా పేట్రేగి పోతుందనే చెప్పాలి. ఇలాంటి వ్యాపారాలపై ఇప్పటికైనా సంబందింత అధికారులు చర్యలు తీసుకోకపోతే మాఫియా చేతివాడకం వల్ల ఎర్రమట్టి కొండలన్నీ చదునయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా అక్రమంగా మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్లు

**: జిల్లా కలెక్టరు డా.కె శ్రీనివాసులు**



**నంద్యాల, ఏప్రిల్ 30,ప్రభాతవార్త ప్రతినిధిః**
లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో భాగంగా నోటాతో కలిపి అభ్యర్థుల సంఖ్య 17 నుంచి 32 లోపు ఉంటే రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరం అవుతాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డా.కె శ్రీనివాసులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో అన్నారు. మంగళవారం కలెక్టరు ఛాంబర్‌లో పోలింగ్ నిర్వహణకు అవసరమయ్యే బ్యాలెట్ యూనిట్ల కేటాయింపు విషయంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో డిఆర్వో ఏ పద్మజ, కాంగ్రెస్ పార్టీ తరుపున సయ్యద్ రియాజ్ బాష, టిడిపి ప్రతినిధులు శివరామ్ కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, బిజెపి పార్టీ తరుపున నాగశివసాయి సందీప్, సిపిఐ(ఎం) పార్టీ తరుపున పూల నరసింహులు బిఎస్పీ పార్టీ తరుపున కుట్టు శ్రీనివాసులు, ఎస్‌డిపిఐ తరుపున ఎస్‌ఎం హానిఫ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డా.కె శ్రీనివాసులు మాట్లాడుతూ సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తరువాత నంద్యాల పార్లమెంటు–31, నందికోట్కూరు అసెంబ్లీ నియోజకవర్గం–18, బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గం 28, ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం 18, శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గం 18, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం 28, డోన్ అసెంబ్లీ నియోజకవర్గం 16 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో కలిపి అభ్యర్థుల సంఖ్య 17కు మించితే అదనపు బ్యాలెట్ యూనిట్ వినియోగించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని నంద్యాల పార్లమెంటు నియోజకవర్గంతో పాటు 6 అసెంబ్లీ సెగ్మెంట్లలో అభ్యర్థులు లెక్కకు మించి ఉండడంతో అదనపు బ్యాలెట్ యూనిట్లను అమర్చి పోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఉందన్నారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నంద్యాల పట్టణంలోనే టెక్కెమార్కెట్‌యార్డులో వున్న స్ట్రాంగ్‌రూంలలో భద్రపరిచి నిల్వ ఉన్న 245 బ్యాలెట్ యూనిట్‌లను డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి తరలించే ప్రక్రియలో పాల్గొని అధికారులకు దిశ నిర్దేశం చేశారు. 3325 బ్యాలెట్‌యూనిట్‌లు బెంగుళూరు నుండి తెప్పిస్తున్నామని వాటిని బెల్ ఇంజనీర్‌లతో ఎఫ్‌ఎల్‌సి చేయించి సంబంధిత నియోజకవర్గాలకు చేరవేస్తామని కలెక్టరు వివరించారు.

## పులికనుమలో టిడిపికి షాక్..!

**– 30కుటుంబాలు వైసిపిలో చేరిక**

**పెద్దకడుబూరు,ఏప్రిల్ 30,ప్రభాతవార్త :** మండల పరిధిలో పులికనుమ గ్రామంలో టిడిపి పార్టీకి షాక్ తగిలింది. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ వీరాభిమానులు నల్లారెడ్డి,ఈరన్న మరియు జయప్ప, బసప్ప, నర్సి రెడ్డి,వీరేష్, రాముడు,ధర్మరాజు,పూజారి అంజినేయ,పెద్దనరసయ్య,రాగన్న,చిన్న మారెప్ప,దాసప్పతో పాటు 30కుటుంబాలు మంగళవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సోదరుడు టిటిడి బోర్డు సభ్యుడు సీతారామిరెడ్డి మరియు పెద్దకడుబూరు మండల నేతలు పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డిల ఆద్వర్యంలో తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెదేపా కార్యకర్తలకు సీతారామిరెడ్డి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్న మహదేవ,వెంకటేష్,పెద్దమహదేవ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి తీపి... అతిమధురం

- : మామిడి పనస సపోటా పండ్లతో ఆహ్లాదకరం
- : కేసుల్లో అదరడు.. బెదరడు
- : కొత్తపల్లి పోలీస్ స్టేషన్ లో సాధారణంగా పండిన ఫలాలు
- : అక్రమార్కుల గుండెల్లో సింహ స్వప్నం
- : తెలంగాణ అక్రమమద్యాన్ని నిషేధించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు
- : ఎస్సై హరిప్రసాద్ అందించే సేవలు పోలీస్ శాఖ కే మరువలేని సేవలు








**ఆత్మకూరు ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** ప్రకృతి తీపి అతిమధురంగా ఉంటుంది సాధారణంగా పండించే పంటల్లో ఫలాలు ఎంతో మధురానుభూతిని అందిస్తాయి ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన వాతావరణం పండిన ఫలాలు నేడు మండలానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పవచ్చు.. ఇదే తరహాలోని అక్రమార్కుల గుండెల్లో సింహ స్వప్నంలా విధులు నిర్వహిస్తూ కేసుల్లో ఎక్కడ రాజీ లేకుండా ఎన్నికల నిబంధనలు పాటిస్తూరాజకీయ నాయకులకు..అదరకుండా బెదరకుండా.. అక్రమ మద్యం కేసులో పట్టుబడిన కీలకమైన నేతలపై కేసులు నమోదు చేస్తూ నేడు ఆత్మకూరు పోలీస్ డివిజన్ పరిధిలో ప్రత్యేక పోలీస్ సేవలందిస్తున్న ఎస్ఐ హరిప్రసాద్ పై ప్రత్యేక కథనం... నంద్యాల జిల్లా ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి ఎస్సైగా విధులు నిర్వహిస్తూ స్టేషన్ చుట్టూ పచ్చటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటుచేసి వివిధ రకాల పండ్ల మొక్కలు పెంచి సాధారణంగా ఫలాలు పండించాలంటే ఎన్నో రకాల మందులు పిచికారి చేయాల్సి ఉంటుంది అలాంటిదేమీ లేకుండా ప్రకృతి ఒడిలో పండిన అతి మధురమైన ఫలాలు సపోటా పనస మామిడి ఉసిరి జామ తోపాటు పలు రకాల పండ్ల మొక్కలు ఉండడంతో నేడు పోలీస్ స్టేషన్లో ఫలాల కాపు అతిమధురంగా కాపు కాచిందని చెప్పవచ్చు పచ్చటి ఫలాల మొక్కల మధ్యలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకొని ఎన్నికల సమయంలో అక్రమార్కులకు నిద్ర లేకుండా చేస్తున్న ఎస్సై హరి ప్రసాద్ సేవలు పోలీస్ శాఖకే మరువలేని సేవలను చెప్పవచ్చు... తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దుల నుంచి తరలిస్తున్న అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఎంతమంది చెప్పిన ఎవరి మాట వినకుండా ఎన్నికల నిబంధనలు పాటిస్తూ విధి నిర్వహణ చేస్తున్న ఎస్సై హరిప్రసాద్ ఆత్మకూరు డివిజన్ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నారు



# నేతలకు మద్యం.. పరేషాన్..!

- మద్యం లేక గ్రామ నాయకులతో ఘర్షణపడుతున్న కార్యకర్తలు
- ఫోన్ పే, గూగుల్ పేతో ఇబ్బందులు పడుతున్న నేతలు, మందుబాబులు
- పోలీసులు, సెబ్ అధికారుల తనిఖీలు ముమ్మరం..
- ఎన్నికలంటే డబ్బు...మద్యమే..

**సార్వత్రిక ఎన్నికల్లో నేతలకు మద్యం పరేషాన్‌గా మారింది. ప్రభుత్వ నిబంధనలు నేతలకు, గ్రామస్థాయి నేతలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ప్రభుత్వం మద్యం దుకాణాల్లో రెండు రోజుల నుంచి డబ్బులు కాకుండా ఫోన్ పే, గుగూల్ పేలతోనే మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. మద్యం బాబులకు ఒక్కొక్కరికి 3 క్యాటర్ల కంటే ఎక్కువ మద్యాన్ని ఇవ్వడం లేదు. ఎన్నికల వేళ నేతలతో పాటు కార్యకర్తలు ఎండను లెక్కచేయకుండా ప్రచారాల్లోపాల్గొంటున్నారు. ఉదయమే మళ్లీ ప్రచారంలో పాల్గొనాలంటే రాత్రి చుక్కపడందే పడుకోలేరు. నేతలు రాత్రి మద్యం ఇవ్వకపోతే ప్రచారాలకు ఢుమ్మా కొడుతున్నారు.**



నంద్యాల, ఏప్రిల్ 30, ప్రభాతవార్త ప్రతినిధిః
నంద్యాల నియోజకవర్గంలో నేతల పరిస్థితి ఎలా ఉందంటే అమ మ్మపెట్టదు..అయ్యపెట్టాడు అన్నచందంగా ఓ పార్టీ నేత చిల్లి గవ్వ ఖర్చుపెట్టకపోవడంతో మరోపార్టీ నేత పొలుపలుగా ఖర్చుపెడతారన్న అశలు అడియాశలయ్యాయి. పక్కంట్లో వంటకాల వాసన మా ఇంటికి వచ్చిన వాసనతో కడుపు నిండింది అన్నమాదిరిగా నేతలు ఆయనను చూసి ఈయన మారిపోయారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఎన్నికల సమయంలో పోలీసుల తనిఖీలు ఉంటాయని ముందు జాగ్రత్త చర్యగా నేతలు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో నేతలకు డబ్బులిచ్చి మద్యాన్ని గుట్టుచప్పుడుగా దాచుకునే వారు. ఎన్నికల ప్రచార సమయంలో కార్యకర్తలకు రాత్రి వేళల్లో మద్యాన్ని ఇచ్చేవారు. నంద్యాల్లో అని న్నపార్టీల నేతలు మాట్లాడుకున్నారో ఏమో చిల్లిగవ్వ ఖరు ్చపెట్టడం లేదని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పార్టీలో చేరేవారికి ప్రచారాల్లో పాల్గొనే వారికి కాస్తో, కూస్తో ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. తప్ప నేతలను నమ్ముకొని వచి ్చన వారు నిరాశతో వెళ్తున్నారు. నేతల విజయం కోసం వచ్చేవారికి రోజువారి ఖర్చులైన పెట్రోలు, మంచినీళ్లుచ మజ్జిగ అలవాటు వున్నవారికి ధూమపానం ఖర్చులు ఎంతలేదన్న ఒక్కొక్కరికి రూ.300 అవుతుంది. నేతలు మద్యం ఇవ్వకపోవడంతో ఒక క్వాటర్ రూ.200 పెట్టి తాగాల్సి ందేనని చెప్పుకొస్తున్నారు. నంద్యాల పట్టణంలో 42 వార్డుల్లో, నంద్యాల గోస్పాడు మండలాల్లో దాదాపు అన్నిచోట్లు అన్ని పార్టీల కార్యకర్తలకు మద్యం రోజుకు 200 క్వాటర్లు ఇవాల్సి ఉంది. ఎన్నికల నిబంధనలు ఉండడంతో మద్యం దుకాణాల్లో సరిపడ మద్యం లేక కావాలన్న దొరకని పరిస్థితి ఇతర రాష్ట్రాల నుంచి దొంగచాటుగా తీసుకోస్తామంటే బార్డర్ల వద్దపోలీసులు సెబ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేయడంతో మద్యం అక్రమ రవాణా కష్టసాధ్యమయింది. పోలింగ్ పదిరోజుల ముందు మద్యం దొరక్కపోవడంతో పట్టణ, గ్రామస్థాయి నేతలకు తలనొప్పిగా మారింది. నేతలు డబ్బులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామ నాయకులు చెప్పుకోస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇలాంటి ఎన్నికలు ఎప్పుడుచూడలేదని మేధావులు పేర్కొంటున్నారు. ఉప్పు, కారం, పులుపు లేని చప్పిడి ఆహారంలా డబ్బు మద్యం లేక ఎన్నికలు రుచిగా ఉంటాయా చప్పగా ఉంటాయా ఎన్నికల్లో డబ్బు, మద్యం పొలుపలు అని ఆశపడ్డవారికి అడియాశలయ్యాయి. ఎన్నికల్లో ఈ పదిరోజులు పది యుగాలుగా ఉన్నట్లు ఉందని గ్రామ నాయకులు పెదవి విరుస్తున్నారు. డబ్బు మద్యం ఖర్చుచేయని నేతలకు ప్రజలు కార్యకర్తలు ఎలాంటి చరిత్రను పునరావృతం చేస్తారో వేచిచుద్దాం.

## వేడి గాలులతో..

# ఉక్కిరి బిక్కిరి..!



**కర్నూలు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :**
ఎండలు దంచికొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు భయంకరంగా పెరిగుతున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ, అలాగే విశాఖ వాతావరణ కేంద్రం ప్రకటించాయి. విపరీతమైన వడగాలులు వీచే అవకాశం ఉందని తగిన జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నిప్పుల వర్షమే కురిసినంత ఎండ తీవ్రత ఉంటుందని జర భద్రం అని వాతావరణ శాఖ పేర్కొంది. ఏపీలో మరో రెండు మూడు రోజుల పాటు వడగాలులు, ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని చెప్తున్నారు. పలు చోట్ల ఎండ తీవ్రంగా ఉంటుందని , బాగా ఎండ సమయాల్లో బయట తిరగవద్దని తెలిపింది. రాయలసీమలో 40 డిగ్రీల నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు పైగా నమోదవుతాయని అలాగే రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. సమ్మర్ హీటెక్కిస్తోంది. వేడి గాలులు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఎండ వేడిమికి జనాలు అల్లాడుతున్నారు. ఉదయం 9 దాటితే చాలు ఉక్కపోత చికాకు తెప్పిస్తోంది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ఈసారి ఎండలు దంచికొడుతుండటంతో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వేసవిలో మంచినీరే దివ్య ఔషధమని చెబుతున్నారు. ఎండ వేడిమితో శరీరం నుంచి చెమట రూపంలో నీరు ఎక్కువగా బయటకు వెళ్లిపోతుంటుంది. కాబట్టి వడదెబ్బ తగలకుండా, ఎండల నుంచి ఉపశమనం కోసం కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది. పెరుగుతున్న టెంపరేచర్ వేసవికాలం మొదటి నుంచే భానుడు భగభగ మండుతున్నాడు. రోజురోజుకి టెంపరేచర్ పెరిగిపోతోంది. ఇప్పటికే పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు ఎండ వేడిమిని తట్టుకోలేకపోతున్నారు. అయితే సమ్మర్ హీట్ ను బ్లాస్ట్ చేసి ఉపశమనం పొందాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు వైద్యులు. లేదంటే తలనొప్పి, ఒళ్లు మంట, డీ హైడ్రేషన్ లాంటి సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు.

సమ్మర్ లో వడదెబ్బ చాలా డేంజరస్. వేసవికాలంలో శరీర ఉష్ణోగ్రత గణనీయంగా పెరగడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ తగలకుండా తప్పించుకోవచ్చు. బయటకు వెళ్లేటప్పుడు కచ్చితంగా వెంట వాటర్ బాటిల్ ఉండేలా చూసుకోండి. క్రమం తప్పకుండా వాటర్ తాగుతూ ఉండండి. వేసవికాలంలో ఆల్కహాల్, సిగరెట్, కెఫీన్ వంటి వాటికి దూరంగా ఉంటే బెటర్. ఎందుకంటే వాటివల్ల శరీర ఉష్ణోగ్రతలు పెరిగే ఛాన్సుంది. ఎండలో ఎక్కువగా తిరుగుతుంటే సూర్యరశ్మి తగిలి వడదెబ్బ తాకే ఛాన్సుంది. దాంతో వాంతులు, అలసట, తలనొప్పి, కళ్లు తిరగడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. వెంటనే డాక్టర్లను సంప్రదించడం ఉత్తమం. గుండె సంబంధిత, ఊపిరితిత్తుల వ్యాధులు, మూత్రపిండ సమస్యలతో బాధపడుతున్నవారు ఎక్కువగా ఎండలో తిరగకపోవడమే బెటర్. పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్త ఎండకాలం ఎవరైనా సరే జాగ్రత్తగా ఉండాల్సిందే. ఇక చిన్నపిల్లల విషయంలో మరికొంత కేర్ తీసుకుంటే మంచిది. అప్పుడే పుట్టిన పిల్లలు, పాలు తాగే వయసున్న పిల్లలకు కచ్చితంగా క్రమం తప్పకుండా తల్లి పాలు ఇవ్వడం బెటర్. వాతావారణంలో ఉష్ణోగ్రతలు పెరిగితే పిల్లల బాడీ టెంపరేచర్ కూడా పెరుగుతుంటుంది. అయితే దాన్ని కంట్రోల్ చేయడం పిల్లల మెదడులో చాలా బలహీనంగా ఉంటుంది. అందుకే పిల్లలకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఎండలో ఆడుకోవడం ద్వారా చెమట రూపంలో నీరు బయటకు వెళ్లిపోతుంది. దాంతో శరీరానికి కావాల్సిన లవణాలు కోల్పోయి నీరసానికి గురవుతారు. అందుకే వారికి సాధ్యమైనంత నీళ్లు తాగించడం ఉత్తమం. వాళ్లు ఆటలో పడటంతో నీళ్లపై పెద్దగా ధ్యాస ఉండదు. కానీ, పెద్దవాళ్లే వారిని కనిపెడుతూ మధ్యమధ్యలో నీళ్లు తాగిస్తే మంచిది. ముఖ్యంగా ఆరేళ్ల లోపు పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోండి. వారికి బాడీ టెంపరేచర్ బాగా పెరిగితే ఫిట్స్ వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది. వృద్ధుల విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎండ వేడికి వాళ్లు తొందరగా అలసిపోతారు. కొన్ని సందర్భాల్లో వేడి తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతుంటారు. వైద్యులను సంప్రదించి ఆహార నియమాలతో పాటు ఇతరత్రా సూచనలు తీసుకోవడం బెటర్.

సమ్మర్ లో చర్మం తొందరగా ఎండ వేడికి గురవుతుంది. సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల వల్ల చర్మంపై ముడతలు ఏర్పడే ప్రమాదం ఉంది. దాంతో చర్మ సౌందర్యం దెబ్బతింటుంది. కొన్ని చిట్కాలతో రోజంతా చర్మంపై తేమ ఉండేలా చూసుకోవచ్చు. చర్మం బాగా పొడిబారినప్పుడు సబ్బుతో ఎక్కువ సార్లు కడగవద్దు. కానీ చల్లని నీటితో వీలైనన్ని సార్లు ముఖం కడుక్కుంటే తాజాగా ఉంటుంది. అయితే అన్నింటికంటే ముందు నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల చర్మం దెబ్బతినదు. పోషక పదార్థాలు ఎక్కువగా లభించే పండ్లు తీసుకోవడం బెటర్. కీరదోస, బీట్‌రూట్, క్యారట్ లాంటి పచ్చి కూరగాయలు కూడా తీసుకోవచ్చు. కొబ్బరి బొండాలు, మజ్జిగ కూడా చర్మ సౌందర్యాన్ని కాపాడటానికి దోహదపడతాయి. వేసవిలో సాధారణంగా ముఖంపై జిడ్డు పేరుకుంటుంది. అయితే ఎండలో తిరిగొచ్చి ఇంటికి వచ్చిన వెంటనే ముఖం కడుక్కోవద్దు. కాసేపాగాక, చల్లటి నీటితో రెండు మూడు సార్లు కడుక్కుంటు ఫ్రెష్ గా కనిపిస్తారు. అయితే స్క్రబ్బర్‌లను మాత్రం ఉపయోగించకండి. దానివల్ల చర్మం మరింత పొడిబారుతుంది.

## స్మశాన వాటిక సమస్యను పరిష్కరిస్తాం

**– టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి**

**పరమాన్‌దొడ్డి(మంత్రాలయం),ఏప్రిల్ 30,ప్రభాతవార్త:** మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి మజారా గ్రామమైన ఓంనగర్‌లో నెలకొన్న స్మశాన వాటిక సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు.మంగళవారం ఓంనగర్ గ్రామ ప్రజల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆయనగ్రామంలో పర ్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత ్సరాల నుండి గ్రామ ప్రజలు స్మశాన వాటికకు స్థలంలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.ఉమ్మడి టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే సొంత నిధులతో స్థలం కొనుగోలుచేసి స్మశాన వాటిక స్థల సమస్యను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.అనంతరం గ్రామ ప్రజలు రాఘవేంద్రరెడ్డిని దుశ్శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలోటిడిపి సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి,చావడి వెంకటేష్,గువ్వల భీమన్న,మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, చంద్ర,యల్లప్ప,పురుషోత్తం,శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపిలోకి చేరిన బిసివై పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి ఆర్ కౌలుట్ల యాదవ్

**తుగ్గలి,ఏప్రిల్ 30,ప్రభాతవార్త :** భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి మారెళ్ల ఆర్ కౌలుట్ల యాదవ్ మంగళవారం పత్తికొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీదేవమ్మ సమక్షంలో వైసిపి పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కౌలుట్ల యాదవ్ మాట్లాడుతూ బిసివై పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తన నామినేషన్ ఉప సంహరించుకుని టిడిపిలోకి వెళ్లడంతో బిసివై పార్టీకి అభ్యర్థి లేకపోవడంతో తాను వైసిపి నాయకులు తుగ్గలి శ్రీనివాస్‌రెడ్డి,పెండేకల్ భాస్కర్‌రెడ్డి,జగన్నాథ్ రెడ్డి,మధు యాదవ్,పార్టీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్ యాదవ్,మారెళ్ల సర్పంచ్ సుధాకర్‌రెడ్డిల సహకారంతో వైసిపి పార్టీలోకి చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ బిసివై పార్టీ నుండి వైసిపి పార్టీలోకి చేరిన కౌలుట్ల యాదవ్‌కు వైసిపి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పందికుంట రామాంజనేయులు,గణ మద్దిలేటి,వడ్డే గోపాల్,రాముడు,మంకీ రాముడు,మంకీ లింగన్న,ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ చిన్న రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నుంచి టిడిపిల్లోకి 280 కుటుంబాలు చేరిక

**ఎమ్మిగనూరు , ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**
ఎమ్మిగనూరు నియోజకవర్గంలో టిడిపిలోకి వలసలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు దాదాపు 280 మంది కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలోకి టిఎన్‌ఎస్‌ఎఫ్ మాదిగ నాగరాజు అధ్వర్యంలో మాజీ సర్పంచ్ లక్ష్మన్న కుటుంబ సభ్యుల వర్గం బొగ్గుల ప్రభుదాసు, ముస్లిం అబ్దుల్లా సాహెబ్, ఈడిగ పీసు లింగమయ్య గౌడ్‌లు టిడిపిలోకి చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి బివి.జయనాగేశ్వర రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా అరాచక పాలన సాగించిన వైసిపిని ఇంటికి సాగనంపుదామని అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కష్టపడాలని సూచించారు. ఈకార్యక్రమంలో బోయ మేకల గోపాల్, కురువ రంగస్వామి, హనుమన్న నాయుడు, పులకుర్తి సిబి రవి, ఎనుగొట్ల నరసింహుడులతో పాటు తదితరులు పాల్గోన్నారు.

## వైసిపిలోకి చేరికల ఊపు..!

**–టిడిపి నుండి వైసిపిలోకి చేరిన 33వ వార్డు కార్యకర్తలు**

**– ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా..బుట్టా రేణుక**

**ఎమ్మిగనూరు , ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** వైసిపిలో చేరికల ఊపు జోరందుకుంది. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ పలువురు అభిమానులు, నేతలు వైసిపిలో చేరుతున్నారు. ఇందులో భాగంగానే ఎమ్మిగనూరు పట్టణంలోని 33వ వార్డు నుండి టిడిపి కార్యకర్తలు వందల సంఖ్యలో వైసిపిలోకి చేరడం జరిగింది. ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, బుట్టా శివ నీలకంఠ, బుటా యుగంధర్, మునిసిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ సమక్షంలో టిడిపి నుండి వైసిపిలోకి భారీగా చేరికలు జరిగాయి. 33వ వార్డు ఇంచార్జి వడ్డె వీరేష్ అధ్వర్యంలో టిడిపి యువకులు, యువత, మహిళా కార్యకర్తలు దాదాపు 150 మంది వైసిపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసంధర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసిపిలో చేరడం జరిగిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యర్తలు సైనికుల్లా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్,జగన్ మోహన్ రెడ్డిని చూడాలని కోరారు. వైసిపి అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందచేయడం ఒక్క వైసిపికే సాధ్యమన్నారు. కావున ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## సరస్వతి విద్యాపీఠం కార్యదర్శిగా సల్ల నాగరాజు యాదవ్



**చాగలమర్రి,ఏప్రిల్30,ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా సరస్వతి విద్యాపీఠం కమిటీ కార్యవర్గ సభ్యులుగా సల్ల నాగరాజు యాదవ్‌ను మంగళవారం ఎన్నుకోవడం జరిగింది. భారతి విద్యామందిరం సమితి అధ్యక్షులు రాచమడుగు చెంచు సుబ్బారావు గుప్తా మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ సభ్యులుగా సల్ల నాగరాజు యాదవ్‌ను ఎన్నుకోవడం పట్ల చాలా అభినందనీయమని ఆయన సేవలు సరస్వతి విద్యాపీఠానికి ఎంతో అవసరమన్నారు. మంగళవారం స్థానిక చాగలమర్రిలోని భారతి విద్యామందిరం నందు పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సల్ల నాగరాజు యాదవ్‌ను అభినందించి ఆయనకు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మేడ ప్రభాకర్, సుంకు రాజేష్, భారతి విద్యామందిరం ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, అధ్యాపకులు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు




**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్30,ప్రభాతవార్త :** శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్య కళారాధన కార్యక్రమంలో బాగంగా)సోమవారంనాడు శివనాట్య కళా నిలయం,తిరుచానూరు,తిరుపతి వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.కాగా ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గణేశస్తుతి,శివపంచాక్షారి,శవతాండవం,శంకర శశిధర,మహాదేవశంభో శివాష్టకం,తదితర గీతాలకు యువదర్శిని,మహాలక్ష్మి,తనయ,స్వప్న,భువనేశ్వరి ,మోనిశ్రీ,చాందినీ,తేజేష్,భవిష్య తదితరలు నృత్య ప్రదర్శన చేసారు.ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు సంప్రదాయ నృత్యం,వాయిద్య సంగీతం,భక్తి రంజిని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ ధర్మపథం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ధృవపత్రాలు పంపిణీ




**చాగలమర్రి,ఏప్రిల్30,ప్రభాతవార్త:** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషనల్ కోర్సు అయినటువంటి ఎలక్ట్రానిక్ కోర్సులో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుండి మొదటిసారి ప్రవేశపెట్టిన 12 రోజుల ఆచరణాత్మక జ్ఞానం(ఇంటర్న్‌షిప్) కార్యక్రమాన్ని 26 మంది విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు సాయి రాజేశ్వరి ఇంజనీరింగ్ కాలేజి ప్రొద్దుటూరు మరియు చాగలమర్రిలోని త్యాగరాజు ఎలక్ట్రికల్, కిరణ్ ఎలక్ట్రికల్‌లను సందర్శించడం జరిగింది. చాగలమర్రి ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఒకేషనల్, టెక్నికల్ కోర్సుల ద్వారా ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరగా లభిస్తాయన్నారు. అనంతరం ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన విద్యార్థులకు ధృవపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. వృతివిద్య ఉపాధ్యాయులు ఎస్.మధురిమ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుమార స్వామివారికి విశేష అభిషేకం



**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్29,ప్రభాతవార్త :** శ్రీగిరిక్షేత్రంలో లోక కల్యాణం కొసం షష్టిని పురస్కరించుకోని దేవస్థానం సోమవారం నాడు ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి)వారికి విశేషపూజలను నిర్వహించడం జరిగింది.ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం,షష్టి తిధి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా(సర్కారిసేవగా)నిర్వహించబడింది .కాగా కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోక కల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ,వ్యాపార,వ్యవహారాలలో అటుపోట్లు తోలగిపోయి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. ఈ అబిషేకానికి ముందుగా దేశం శాంతిసౌబాగ్యలతో విలసిల్లాలని ,ప్రకృతివైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి,పంటలు బాగా పండాలని, జనులకు ఆయారారోగ్యాలు,అన్ని సామాజిక వర్గాలు ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటూ అర్చక స్వాములు సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహగణపతిపూజ జరిపి అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకం,సుబ్రహ్మణ్యఅష్టోత్తరము చేసిన అనంతరం సుబ్రహ్మణ్యస్తోత్రము పారాయణలు చేసారు.అదే విధంగా స్వామివారికి అభిషేకంతో పంచామృతాలతోనూ,వివిధ పళ్ల రసాలతోచేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

## శనగల బసవన్న స్వామివారికి విశేష పూజలు



**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్30,ప్రభాతవార్త :** లోక కల్యాణం కొసం దేవస్థానం మంగళవారంనాడు ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరస్వామికి(శనగల బసవన్న స్వామివారికి)విశేషార్చనలను నిర్వహించడం జరిగింది.ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా(సర్కారిసేవగా)ఈ కైంకర్యం జరిపించబడింది.ప్రదోశకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరిగింది.ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌబాగ్యాలతో విలసిల్లాలని ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి,పంటలు బాగా పండాలని,పాడి సమృద్ధిగా ఉండాలని అన్ని సామాజికవర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు,వేదపండింతులు సంకల్పాన్ని చెప్పడం జరిగింది.అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహగణపతి పూజను జరిపించబడింది.ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ మరియు మల్లికగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు.తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించడం జరిగింది.తరువాత నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరిగింది.చివరగా స్వామికి నివేదన సమర్పించబడింది.

## ఓటర్ స్లిప్‌ల పంపిణీ



**చాగలమర్రి,ఏప్రిల్30,ప్రభాతవార్త:** మండలంలోని పెద్దబోదనం, వివిధ గ్రామాలతోపాటు చాగలమర్రి పట్టణంలో ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. పట్టణంలోని వార్డుల్లో బూత్‌లవారిగా ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేశారు. 1121 స్లిప్‌లను బీఎల్‌వో వెంకట్రామిరెడ్డి పంపిణీ చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా వారు ఓటుహక్కు వినియోగించుకునేందుకు వారి ఇంటి వద్దనే ఓటర్‌స్లిప్‌లు పంపిణీ చేసినట్లు బీఎల్‌వోలు తెలిపారు.

## శ్రీ బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం



**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్30,ప్రభాతవార్త :** శ్రీగిరిక్షేత్రంలో లోక కల్యాణం కోసం దేవస్థానం మంగళవారంనాడు సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించడం జరిగింది.ప్రతి మంగళవారం మరియు అమావాస్యరోజుల లో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించడం జరిగింది.ముఖ్యంగా ఆగమసంప్రదాయాయంలో క్షేత్రపాలక పూజకు చాల విశేషస్థానం ఉంది.క్షేత్రపాలకుడు పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయబాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు.ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోశాలు,దుష్టగ్రహపీడలు తోలగిపోతాయి.అదేవిధంగా సంతానం,ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి.ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ,బిల్వోదకం,గంధోధకం, పుష్పోదకం,శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరిగింది.

## సుధాకర్ కుటుంబానికి అండగా ఉంటాం - మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



**బనగానపల్లెరూరల్,ఏప్రిల్30,ప్రభాతవార్త:** బనగానపల్లె నియోజకవర్గం పరిధిలోని అవుకు మండలం కాశీపురం గ్రామానికి చెందిన ఎం.సుధాకర్ కుటుంబానికి అండగా ఉంటామని బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి భరోసానిచ్చారు. టీడీపీ అభిమాని సుధాకర్(56) అకస్మాత్తుగా మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కాశీపురం గ్రామానికి చేరుకుని సుధాకర్ భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే భవిష్యత్తులో సుధాకర్ కుటుంబానికి అన్ని విధాలుగా తాము అండగా ఉంటామని బీసీ రాజారెడ్డి వారికి భరోసానిచ్చారు. బీసీ రాజారెడ్డి వెంట మెట్ల రామిరెడ్డి, మనోహర్‌రెడ్డిలు ఉన్నారు.

## జాకీర్ మృతి బాధాకరం

**బనగానపల్లెరూరల్,ఏప్రిల్30,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణం కొండపేటకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కార్పెంటర్ జాకీర్ అకస్మాత్తుగా మృతి చెందడం చాలా బాధాకరమని బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కార్పెంటర్ జాకీర్ ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మంగళవారం ఉదయం కొండపేటలోని జాకీర్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బీసీ రాజారెడ్డి వెంట టిప్‌టాప్ కలాం, రహీమ్‌నాయక్, చోటు తదితరులు ఉన్నారు.

## నీటిని వృధా చేయకుండ పొదుపుగా వాడుకోవాలి

:- సర్పంచ్ చలవాది రంగమ్మ




**హొళగుంద,ఏప్రిల్ 30,ప్రభాతవార్త :** నీటిని వృధా చేయకుండ పొదుపుగా వాడుకోవాలి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చలవాది రంగమ్మ,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్,ఉప సర్పంచ్ మీనాక్షమ్మ ప్రజలకు సూచించారు. మంగళవారం వారు మాట్లాడుతూ హొళగుందలో తీవ్రమైన నీటికొరత ఉందని కావున 6రోజులకోసారి నీటిని వదులుతున్నట్లు దండోరా వేయించామన్నారు. కావున మండల కేంద్రమైన హొళగుందలోని ప్రజలు నీరు ఎంత పొదుపుగా వాడుకుంటే అంత మంచిదని తెలియజేశారు. మనం వృధా చేసిన ఈ మండే ఎండల్లో మరొకరి దాహాన్ని తీరుస్తాయన్నారు. మనం నీటిని పొదుపుగా వాడుకోకపోతే నీటి కష్టాలు తప్పవన్నారు. గుక్కెడు నీటి కోసం పొలాల బోర్ల వద్ద పడిగాపులు కాయకుండ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సర్పంచ్ తనయుడు పంపాపతి,ఉప సర్పంచ్ భర్త దొడ్డబసప్ప,వార్డుమెంబర్లు హమీద్,సుభాన్,అబ్దుల్ రహిమాన్,శంకరప్ప ,మల్లయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి పెద్దలు మమ్మల్ని గుర్తించడం లేదు..!

:- ఎంపిపి అనితా యాదవ్



**మద్దికెర,ఏప్రిల్ 30,ప్రభాతవార్త :** వైసిపి పెద్దలు మమ్మల్ని గుర్తించడం లేదని ఎంపిపి అనితా యాదవ్,ఆమె భర్త మాజీ ఎంపిటిసి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేసినా సరైన గుర్తింపు లభించడం లేదన్నారు. అందుకే మండలంలో ఎక్కడ ప్రచారం జరిగినప్పటికీ వెళ్లడం లేదన్నారు. అనేకమార్లు మండలంలో మాకు గుర్తింపు లేదని పార్టీ పెద్దలకు తెలియజేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. మండలంలో ఓ ప్రజాప్రతినిధిగా ఉండి కూడా ప్రజలకు సేవ చేయలేకపోతున్నామన్నారు. ప్రస్తుతం నామినేషన్ వేస్తున్నప్పటికీ పార్టీ పెద్దలు మమ్మల్ని ఎవరిని పిలవలేదని అయినా పార్టీ మీద అభిమానంతో వెళ్లడం జరిగిందన్నారు. మండలంలో పార్టీ వర్గాలుగా ఏర్పాటు చేసి చూడడం నచ్చక మా సొంత గృహంలో ఉండిపోవడం జరుగుతుందన్నారు. వేరే పార్టీలోకి వెళ్లలేక మా పార్టీలో మమ్మల్ని నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయలేక సతమతమవుతున్నామన్నారు.

## ఓటర్లకు స్లిప్పుల పంపిణి



**కొత్తపల్లి,ఏప్రిల్ 30,ప్రభాతవార్త:** మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలు జరుగుతుండడంతో అందులో బాగంగా మంగళవారం తహసిల్దార్ తిరుపతయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఓటర్ల స్లిప్పులను పంపిణి చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో జాబితాలో ఉన్న వారి వివరాలు తీసుకొని ఇంటింటికి తిరుగుతూ అందజేశారు. ఏమైన పేర్లలో, ఫోటోలో, చిరునామాలో వివరాలు తప్పులు ఉంటే సరి చూసుకోవాలని రెవెన్యూ సిబ్బంది చూసించారు. ఎదరుపాడు, జడ్డువారిపల్లె, గ్రామాలలో అందజేశారు.

## ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో రాణించిన ఆణిముత్యం



**గడివేముల, ఏప్రిల్30, ప్రభాతవార్త;** గడివేముల మండలం ఆళ్లగడ్డ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పి.ఉమామహేశ్వరరెడ్డి కుమార్తె మనస్వి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 100కు 82 అత్యుత్తమ మమార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానం సాధించింది. దీంతో పలువురు అభినందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన మహేశ్వరరెడ్డి తన కుమార్తెను ఆళ్లగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివించగా, మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రథమ విజేతగా నిలవడం విశేషం.

## యల్లయ్యను పరామర్శించిన మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



**బనగానవల్లెరూరల్,ఏప్రిల్30,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త ఈసారి యల్లయ్యను బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు యల్లయ్య గత రెండు రోజుల క్రితం గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి యల్లయ్య ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. రాజారెడ్డి వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

## టిడిపి మేనిఫెస్టోలో బ్రహ్మణ సంక్షేమంపై దృష్టిపెట్టడం సంతోషకరం

**కర్నూలు విద్య, ఏప్రిల్ 30, ప్రభాతవార్తః** తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో హిందూ దేవాలయాలు, బ్రహ్మణ సత్రాల అస్తుల సంరక్షణకు హిందూ ఎండోమెంటు బోరుడ ఏర్పాటు చేస్తామని, ప్రైవేట్ దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు ఇమాంలకు ఇచ్చేవిధంగా గౌరవ వేతనం ఏర్పాటు చేయడం, వార్షిక ఆదాయం రూ.50 వేలకు పైనా ఉన్న దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రూ.15 వేలు గౌరవ వేతనం, రూ.50 వేల కంటే తక్కువ ఆదాయం ఉన్న దేవాలయాల్లో పనిచేస్తున అర్చకులకు దూప దీప నైవేద్యాల కింద రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచడం, వైదిక అగమశాస్త్రాల విషయంలో అయా దేవాలయాలకు పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వడం, తిరుపతి ఒంటిమిట్ట వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల పవిత్రతకు మూలాధారమైన 1000 కాళ్ళ మండపాలు పునఃనిర్మించుట, గత ప్రభుత్వంలో దేవాలయాలపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం కొరకు కమిషన్ ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడం, పురోహితులకు, వంట బ్రహ్మణులకు, బ్రహ్మణకుల వృత్తిగా గుర్తించడం, బ్రహ్మణ కార్పొరేషన్, బ్రహ్మణ కో-అపరేటివ్ క్రెడిట్ సొసైటి అభివృద్ధి పరచడం, తిరుపతి అన్నిదేవాలయాల అభివృద్ధి కమిటీలలో దేవాలయ అర్చకుడు, మరోక్క బ్రహ్మణునికి ఆ ట్రస్ట్‌బోర్డు మెంబరుగా అవకాశం ఇవ్వడం, ప్రతినియోజకవర్గంలో బ్రహ్మణవర్గానికి అపర ఖర్మలు చేసుకోవడానికి భవనం ఏర్పాటు చేయడం, వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు యువగళం కింద రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వడం మొదలైన బ్రహ్మణ సమస్యలపై మేనిఫెస్టోలో పొందుపరిచినందుకు ఆంధ్రప్రదేశ్ బ్రహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామరాజు కృతజ్ఞతలు తెలిపారు.

## తెదేపాలో చేరిన వైకాపా నాయకులు

**వెల్దుర్తి,ఏప్రిల్30,ప్రభాతవార్త :** మండలంలోని మంగంపల్లి గ్రామానికి చెందిన వైకాపా నాయకులు కుందూరు రాజు తన అనుచరులతో కలిసి మంగళవారం కెఇ నిఖిలేష్ గౌడ్ సమక్షంలో సుబ్బరాయుడు,రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెదేపాలో చేరారు.తెదేపాలో చేరిన రాజుకు పార్టీ కండువా కప్పి నిలిఖేష్‌గౌడ్ సాదరంగా ఆహ్వానించారు.రాబోవు ఎన్నికల్లో తెదేపాను బలపరచాలన్నారు. ఎంపి,ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు.గ్రామంలోని అమ్మవారిని ఆయన దర్శించుకొని మొక్కారు.ముందుగా ఆయన గుంటుపల్లి గ్రామంలో ఆ గ్రామనాయకులు ఈదుల వెంకటరాముడుతో కలిసి ప్రజలతో మాట్లాడారు.చంద్రబాబునాయుడు పలు సంక్షేమపథకాలను మెనిఫెస్టోలో పెట్టారన్నారు.దీంతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా నాయకులు సుబ్బరాయుడు,బొమ్మన రమాకాంత్‌రెడ్డి,చెర్లకొత్తూరు పుల్లయ్య,జయరాముడు,ఈదులవెంకటరాముడు, అమర్‌నాథ్‌గౌడ్,మోహన్‌రెడ్డి,రామచంద్రుడు,మంగంపల్లి శ్రీనివాసులు,సుధాకర్‌గౌడ్, మాజీ జడ్పీటిసి ఐజయ్య,రాఘవేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కుబడి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



**బనగానవల్లెరూరల్,ఏప్రిల్30,ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని జోలాపురం గ్రామానికి చెందిన శ్రీరాములు బాలకృష్ణ, శ్రీరాముల శరత్‌లు శ్రీ పెద్దమ్మ తల్లి అమ్మవారికి అలాగే మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి మొక్కుబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలకృష్ణ, శరత్‌ల ఆహ్వానం మేరకు బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మొక్కుబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా వారు గ్రామానికి చేరుకోగానే స్థానిక టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన విందులో పాల్గొని అతిథ్యాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరు శీనయ్య, టీడీపీ నాయకులు వంగల పరమేశ్వరరెడ్డి, సీనియర్ న్యాయవాది నాగేంద్రారెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు మల్లారెడ్డి, యనకండ్ల ఖాదర్, బత్తుల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ANNEXURE-27**

**FORMAT C-1**

(DECLARATION ABOUT CRIMINAL CASES)
As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme court in WP (Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors. VS Union of India & Anr.)

NAME AND ADRESS OF CANDIDATE: ADINARAYANA REDDY KAPPETA
S/o NARAYANA REDDY KAPPETA
D.No. 25-236-7Y1, RAMANATHAREDDY NAGAR, NEAR RYTUBAZAR, NANDYAL.

NAME OF THE POLITICAL PARTY : NABA BHARATA NIRMANA SEVA PARTY

NAME OF THE ELECTION : GENERAL ELECTION TO LEGISLATIVE ASSEMBL, ANDHRA PRADESH

NAME OF THE COUNSTITUENCY : 139-NANDYAL ASSEMBLY COUNSITUENCY

I ADINARAYANA REDDY KAPPETA a candidate for the above mentioned election declare for public information the following details about my criminal antecedents.

(A) Pending criminal case

| Sl. No. | Name of the Court | Case No. and dated | Status of cases(s) | Section (s) of Acts concerned and brief description of offences(s) |
|---|---|---|---|---|
| 1 | JFMC NANDYAL | PRC.37/2023 | Pending | Section 147,148,341, 427,307,323, 506,109R/W 149IPC Rioting and others |

(B) Details about cases of conviction for criminal offences

| Sl. No. | Name of Court & date(s) of order (s) | Description of offence(s) & punishment imposed | Maximum Punishment imposed |
|---|---|---|---|
| NO | NO | NO | NO |

Sd/- ADINARAYANA REDDY KAPPETA
139-NANDYAL ASSEMBLY COUNSITUENCY

**ANNEXURE-27**

**FORMAT C-1**

(DECLARATION ABOUT CRIMINAL CASES)
As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme court in WP (Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors. VS Union of India & Anr.)

NAME AND ADRESS OF CANDIDATE: MADHU YENNAKANDLA
S/o NAGANNA
D.No. 6-40, ESWAR NAGAR
MAHANANDI,
NANDYAL DISTRICT.

NAME OF THE POLITICAL PARTY: SAMAJWADI PARTY

NAME OF THE ELECTION : GENERAL ELECTION TO LEGISLATIVE ASSEMBL, ANDHRA PRADESH

NAME OF THE COUNSTITUENCY: 135-SRISAILAM ASSEMBLY COUNSITUENCY

I MADHU YENNAKANDLA a candidate for the above mentioned election declare for public information the following details about my criminal antecedents.

(A) Pending criminal case

| Sl. No. | Name of the Court | Case No. and dated | Status of cases(s) | Section (s) of Acts concerned and brief description of offences(s) |
|---|---|---|---|---|
| 1 | SC, ST, COURT, KURNOOL. | 47/2023 Mahanandi Police Station Police authorities referred the case as false | Pending at S.C. S.T. Court Kurnool At FIR Stage | Section 323, 506, 384 R/W 34 IPC and 3(1) (r), 3 (1) (s), 3(2) (va) SC, ST POA ACT. Causing hurt. |

(B) Details about cases of conviction for criminal offences

| Sl. No. | Name of Court & date(s) of order (s) | Description of offence(s) & punishment imposed | Maximum Punishment imposed |
|---|---|---|---|
| NO | NO | NO | NO |

Sd/- MADHU YENNAKANDLA
135-SRISAILAM ASSEMBLY COUNSITUENCY

# వన్యప్రానులపై కుక్కలతో వేటా ప్రారంభం..?




**ఆత్మకూరు ఏప్రిల్30,ప్రభాతవార్త:** శ్రీశైలం, నాగార్జునసాగర్ పెద్ద పులుల అభయారణ్యం పరిధిలోని నల్లమల అటవీ సమీపంలోని గ్రామీణ ప్రాంతాలలో వన్యప్రానులపై ప్రతి రోజు కుక్కలతో వేటను కొనసాగించే విదంగా యువత ప్రతి రోజు పంట పొలాలు, వాగులు, వంకలు పదుల సంఖ్యలో కుక్కల మందలను తీసుకోని వేటను కొనసాగిస్తున్నట్లు సమాచారం. అటవీ శాక అధికారులు ఈ విషయాని పర్య వేక్షణ కొనసాగిస్తున్నారో లేదో వన్యప్రాని ప్రేమికులు ఆరోపణలు చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని పలు రేంజ్‌లలోని గ్రామీణ ప్రాంతాలైన ప్రదేశాలలో కుక్కలను అధికంగా పెంచి వాటితోనే వేటను కొనసాగించే విదంగా ముందుకు వెళ్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతం లోని ఎంతో అరుదైన వన్యప్రాని జంతు జాలం ఉన్నప్పటికి వేసవి కాలంలో నీటి దాహార్తినీ తీర్చుకునేందుకు నీటిప్రదేశాల దగ్గరకు వచ్చే వన్యప్రానులు వేటగాళ్ల చేతులో బలై పోతున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. అధికంగా అడవిపందులు, దుప్పులు వంటి వన్యప్రానులపై కుక్కలతో దాడులు చేయించి వాటి ప్రాణాలను తీసి మాంసంగా విక్రయాలు కొనసాగిస్తున్నారని వన్యప్రానుల ప్రేమికులు అటవీశాఖపై ఆరోపణలు చేస్తున్నారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఆత్మకూరు ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ రామకొండారెడ్డి రాకతో ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించి సిబ్బందితో కేసులు నమోదు చేసే విదంగా ముందుకు వెళ్తున్నట్లు తెలసింది. ప్రకాశం, నంద్యాల జిల్లాలోని మార్కాపురం, గిద్దాలూరు, ఆత్మకూరు నాలుగు డివిజన్‌ల పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ శాఖ ప్రత్యేకంగా పనిచేస్తుం దని వివరించారు.

**ఈ విషయంపై ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ రామకొండారెడ్డిని ప్రభాతవార్త వివరణ కోరగా...**

గ్రామీణ ప్రాంతాలలో కుక్కలతో వన్యప్రానుల వేటా కొనసాగిస్తున్న విషయం మా దృష్టికి రాలేదని అన్నారు. ప్రత్యేక అటవీశాఖ సిబ్బందితో గ్రామీణ ప్రాంతాలలో వేటకు వెళ్లే యువతపై నిఘా ఉంచడం జరిగిందన్నారు. వన్యప్రానులను వేటాడిన, చంపిన అటవీ హాక్కు చట్టాలు కఠినంగా అమలు చేస్తామని డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు సూచించారు.



: గ్రామీణ ప్రాంతాలలో మితిమిరి పోతున్న వేటగాళ్లు
: ఫ్లైయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ రాకతో స్మగ్లరులకు చుక్కలు
: ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్ పరిధిలో వేటకు సిద్ధమవుతున్న యువత
: గ్రామీణ ప్రాంతాలలో వన్యప్రానులు, పర్యావరణంపై అవగాహన
: వన్యప్రానులను వేటాడిన, చంపిన కఠినమైన చట్టాలు
: స్క్వాడ్ డివిజన్‌ల పరిధిలో స్మగ్లరులపై ప్రత్యేక నిఘా

## హోం ఓటింగ్ ప్రక్రియను పకడ్బందిగా నిర్వహించండి



**నంద్యాల, ఏప్రిల్ 30, ప్రభాతవార్త ప్రతినిధిః** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో వృద్ధులకు, దివ్యాంగులకు, కల్పించిన హోం ఓటింగ్ ప్రక్రియను పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డా. కె శ్రీనివాసులు మైక్రో అబ్జర్వర్లను అదేశించారు. మంగళవారం కలెక్టరు ఛాంబర్ లో హోం ఓటింగ్ ప్రక్రియపై మైక్రో అబ్జర్వర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డా.కె శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 15509 విభిన్న ప్రతిభావంతులు 5 వేల మంది 85 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజన్లు ఉన్నారని ఇంటివద్దనే ఓటు వేసే హక్కును ఎన్నికల కమిషన్‌కల్పించిన నేపథ్యంలో హోం ఓటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తిచేసేందుకు 45 మంది మైక్రో అబ్జర్వర్లను నియోజకవర్గాలకు కేటాయించామన్నారు. హోం ఓటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తు ఓటింగ్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని పలు సూచనలు జారీచేశారు. లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రవీంద్రకుమార్, సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

## ఎపిలో కాపు, బలిజ సామాజిక వర్గం ఓటర్లే అదికం



**నంద్యాల, ఏప్రిల్ 30,ప్రభాతవార్తప్రతినిధి :** రాజకీయాలో ఒకపుడు మేదావులు,విద్యా వంతులు సైన్యములో పాల్గొన్నవారికి అలాగే ఫ్రీడం ఫైటర్లకే పరిమితము అలాంటి రాను రాను ఫ్యాక్షన్‌నాయకులతో రాజకీయాల నిండి పోయాయి.అనంతరము డబ్బులున్న వారే రాజకీయలు చేయాలనే దానికి వచ్చారు.గత 10సంవత్సరాల నుండి డబ్బులు, కులం కార్డుతో పాటు పాదయాత్ర చేసే వారే రాజకీయంగా పైకి వస్తున్నారనే పరిశీలకులు అంటున్నారు.అలాంటిదే ప్రస్తుతము ఎపిలో జరిగే ఎన్నికలు నిదర్శనము ఎపిలో సాదారణ ఎన్నికలకు కేవలము 12 రోజుల వ్యవది మాత్రమే ఉంది ఈనెల 13వ తేదిన సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్రము జరుగనుంది. అందుకు ఈఎన్నికల్లో ఏ సామాజిక వర్గానికి ఎన్ని ఓట్లు ఉన్నాయని తెలుసుకోవాలని ప్రతి ఒక్కరిక అసక్తి ఉంటుంది.అ ందుకే ఈశీర్శిను ఇస్తున్నాము. అందులో బాగంగా సామాజిక వర్గాల వారికిగా ఓట్లు

కాపు, బలిజ సామాజిక వర్గం ఓట్లు 52,07,091
ఎస్సి మాల సామాజిక వర్గం ఓట్లు 35,46740
రెడ్డి సామాజిక వర్గం ఓట్లు 26,69029
మాదిగ(యంఆర్‌పియస్) సామాజిక వర్గం 2585725
యాదవ సామాజిక వర్గం ఓట్లు 2554037
ముస్లీం సామాజిక వర్గం టోఓ్ల 2384492
కమ్మ సామాజక వర్గంఓ ఓట్లు 1987911
ఉత్తరాంధ్ర కాపు సామాజిక వర్గం ఓట్లు 1518044
వైశ్య సామాజిక వర్గం ఓట్లు 1341478
బోయ సామాజిక వర్గం ఓట్లు 969868
క్ససామాజిక వర్గం ఓట్లు 1574865
కొప్పుల వెలమ సామాజిక వర్గం టోఓ్ల 965814
పద్యశాలీ సామాజిక వర్గం ఓట్లు 924351
గౌడు సామాజిక వర్గం ఓట్లు 1978826
రజిక సామాజిక వర్గం టోఓ్ల 841457
బ్రాహ్మణ సామాజిక వర్గం ఓట్లు 741656
వడ్డెర సామాజిక వర్గ ం ఓట్లు 554655
నాయిబ్రాహ్మణ సామాజిక వర్గం ఓట్లు 451520
క్షత్రియ సామాజిక వర్గం ఓట్లు 412579
కాలింగ సామాజిక వర్గం ఓట్లు 357070
క్రిష్టియన్ సామాజిక వర్గం ఓట్లు 351320
యానాదుల సామాజిక వర్గం ఓట్లు 309193
కురువసామాజిక వర్గం ఓట్లు 534323
కంసాలి సామాజిక వర్గం ఓట్లు 275691
గవర్ల సామాజిక వర్గం ఓట్లు 262436
ఉమ్మరి సామాజిక వర్గ ం ఓట్లు 252127
ఉప్పరి సామాజిక వర్గం ఓట్లు 236506
దూదేకుల(బిసిడి) సామాజిక వర్గం ఓట్లు 252011
పొలినాటి వెలమ సామాజిక వర్గం ఓట్లు 202840
ముత్తరాశి (ముదిరాజ్) సామాజిక వర్గం ఓట్లు 183718
సుగాలి సామాజిక వర్గం ఓట్లు 173506
బగత సామాజిక వర్గం ఓట్లు 125631 మంది

ఓటుర్లుండగా మే 13వ తేదిన వీరందరు తమ ఓటు హక్కును వినియోగించనున్నారు. అయితే ఎపిలో కాపు, బలిజ ఎస్సి మాల సామాజిక వర్గాల ఓట్లు చాలా ప్రభావితము చేయనున్నాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అయితే ప్రస్తుతము ఎక్కడ ఏ జిల్లాలో చూసిన కులం కార్డు బాగా పని చేస్తున్నది అంటున్నా రు. రాయలసీమ మొదలు కోస్తా,ఉత్తరాంధ్రలో కూడా ఈ కులం కార్డు ప్రబావము పని చేస్తుందని అంటు న్నారు.గతంలో కూడా ఈకులం కార్డునమ్ముకుని కొంద రు రాజకీయలు చేసి బొక్క బోర్ల పడ్డారు.కులం కార్డు లో పాటు ఎపిలో పాద యాత్రలు బాగా కలిసి వచ్చా యి. కులం డబ్బులు, పాదయాత్రు అలాగే ఎన్నికల్లో సెంటిమెంట్లు ప్రబావితము చేస్తాయని రాజకీయ దురందరులు అంటున్నారు.చూద్దాం ఏది ఎంత మాత్రము పని చేస్తుందో ?

## 2,3తేదీల్లో ఆదోని అసెంబ్లీ ఈవిఎం కమీషనింగ్

**ఆదోని రూరల్,ఏప్రిల్ 30,ప్రభాతవార్త :** ఈ నెల 2,3వ తేదీల్లో ఆదోని అసెంబ్లీ ఈవిఎం కమీషనింగ్ ,4,5వ తేదీల్లో కర్నూలు పార్లమెంట్‌కు ఈవిఎం కమీషనింగ్ సంబంధించి సెక్టారల్ అధికారులకు అవగాహన,శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎన్నికల అధికారి/ సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ట్స్ కాలేజీలో సిల్వర్ జూబ్లీ హాల్ నందు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11(నోటాతో కలిపి)మంది అభ్యర్థులు ఆదోని అసెంబ్లీ స్థానానికి,కర్నూలు పార్లమెంట్ స్థానానికి 19మంది నోటాతో కలిపి 20మంది అభ్యర్థులు ఉండడం వల్ల రెండవ బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు చేయడానికి ఈవిఎం కమీషనింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ హసీనా సుల్తానా,డిఎల్‌పిఓ వీరభద్రప్ప, సెక్టరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెల్లా చెదురైన మత్స్యకారుల జీవితాలు....

- ఉందిలే మంచి కాలం.. - మాండ్ర శివానందరెడ్డి



**మిడుతూరు, ఏప్రిల్30, ప్రభాతవార్త;** నందికొట్కూరు పట్టణంలో సోమవారం జరిగిన టీడీపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం కార్యక్రమానికి జనం పోటెత్తడంతో రాబోయే రోజుల్లో మంచికాలం మన ముందు ఉందని, ఎన్నో అభివృద్ధి పనులు, పథకాలకు నాంది పలకబోతునాన్మని నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. కడుమూరు గ్రామానికి చేరుకున్న మాండ్ర శివానందరెడ్డిని స్థానికులు ఎంతో ఉత్సాహంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్న ఉత్సాహం మీలో నేడు కూడా కనబడుతుందని, ఇదే ఉత్సాహం ఎన్నికల దాకా కొనసాగాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్నటి సభ పట్లసంతృప్తి వ్యక్తం చేశడని, అదే కోవలో మనం కూడా మన ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయససూర్యను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటే మన పనులు కూడా వేగవంతంగా పూర్తి అవుతాయన్నారు. వైకాపా నాయకులు చెబుతున్నట్లు మైనార్టీలకు ఎటువంటి నష్టం వాటిల్లే చర్యలను టీడీపీ పార్టీ తీసుకోదని, వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, ప్రత్యేక మేనిఫెస్టో కూడా సిద్ధం చేస్తామని బాబు హామీ ఇచ్చారన్నారు. స్థానిక వైకాపా నాయకులు ఎలాంటి అభివృద్ధి చేయకుండా ఓటు అడుగుతున్నారని, రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి అంతా టీడీపీ పార్టీ చేపట్టినదేనని మాండ్ర చెప్పారు. చిన్న బడ్జెట్ మంజూరు చేసి ఉంటే అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు పూర్తి అయ్యేవని, సీఎం జగన్ ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యానికి ఇది పరాకాష్ట అని చెప్పారు. సంవత్సరాలైన రిజర్వాయర్ పనులు ముందుకు సాగడం లేదన్నారు. దీనివల్ల ఆరు గ్రామాల్లో చేపలు పట్టే జీవనం సాగించే మత్స్య కుటుంబాలకు ఆర్థిక భారం పడిందన్నారు. మత్స్యకారులకు జీవనోపాధి లేక కుటుంబాలు చెల్లా చెదురయ్యాయన్నారు. టీడీపీ పార్టీ అధికారంలోకి రాగానే రిజర్వాయర్ పనులు వేగంగా పూర్తి అయ్యేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య మాట్లడుతూ మిడుతూరు మండలానికి చిరకాల కోరిక అయిన ఎత్తిపోతల పథకం సాధించి పంటలకు సాగునూరు అందిస్తామన్నారు. అలాగే నారా చంద్రబాబునాయుడు సీఎం అయితే పరిశ్రమలురాష్ట్రానికి వస్తాయని, దీంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించిన వారు అవుతారన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో సంపద సృష్టించే సత్తా బాబుకే ఉందని, సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో పేదలకు మేలు జరగబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, ఇద్రూస్, గోవర్ధనరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మక్బూల్, సర్వోత్తమరెడ్డి,సఫీవుల్లా, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పల్లచాని మహేశ్వరరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన ఉద్యోగిని సన్మానించిన కోట్ల



**కోడుమూరు,ఏప్రిల్ 30,ప్రభాతవార్త :** తుంగభద్ర దిగువ కాలువ కోడుమూరు సబ్‌డివిజన్‌లోని కోడుమూరు సెక్షన్‌లో వర్కుఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఎ.రమేష్‌రెడ్డి మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన జాతీయ టీడీపీ ఉపాధ్యక్షులు,డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి,కోడుమూరు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త,కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిలు ముఖ్య అతిథిదులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో కోట్ల సోదరులు పదవీ విరమణ చేసిన రమేష్‌రెడ్డి దంపతులకు శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. గత ముప్పై ఏళ్ల పాటు ఈ ప్రాంతంలోనే ఇరిగేషన్ శాఖలో పనిచేసి సాగు నీటి సరఫరాపై రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తన వంతు కర్తవ్యంగా పనిచేసి తుంగభద్ర దిగువ కాలువ కోడుమూరు సబ్‌డివిజన్‌తో పాటు,గాజులదిన్నె ప్రాజెక్టు సబ్‌డివిజన్‌లోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి సఫలీకృతులయ్యారు. అందుకే ఆ ఉద్యోగిపై ఉన్న ఆత్మాభిమానంతో రైతాంగం భారీగా తరలొచ్చి ఆ ఉద్యోగిని ప్రశంసలతో ముం చెత్తారు. అంతే గాక వృత్తి పరంగా పారదర్శంగా ఉంటూ అన్ని రాజకీయ పార్టీలకు కూడా సుపరిచితుడుగా ఉండి మంచి పేరును సంపాదించుకున్నారు. అందుకే నేడు జరిగిన పదవీ విరమణ కార్యక్రమానికి ఇరిగేషన్ ఉన్నతాధికారులు, ఆయా పార్టీల రాజకీయ పార్టీలైన వైకాపా,తెలుగుదేశం, సిపిఐ,సిపిఎం,స్వచ్ఛంద సంస్థల సభ్యులు,సబ్‌డివిజన్‌లోని ఆయకట్టు రైతులంతా ఇక్కడకు వచ్చి ఘనంగా సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన సభలో రమేష్‌రెడ్డి చేసిన సేవల గురించి పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇరిగేష్ ఇ.ఇ శైలిసారెడ్డి,డి.ఇ.ఇలు భాస్కరరెడ్డి, సుబ్బరాయుడు,లక్ష్మన్‌కుమార్ ,ఇరిగేషన్ యూనియన్ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఆంజినే యులు, జె.ఇలు దుర్గాభవాని, పరమేష్, ఆలీ,మోహన్ రావు, సూర్యప్రకాష్, స్థానిక వర్కు ఇన్‌స్పెక్టర్లు శ్రీను,మాదన్న తదితరులు పాల్గొన్నారు.

## మాజీ వాలంటీర్‌పై వైసిపి కార్యకర్తలు దాడి

:- నేతల సాక్షిగా కొట్టుకున్న వైసిపి కార్యకర్తలు

:- చిన్నతుంబళం వైసిపిలో బయటపడ్డ వర్గ విభేదాలు

**పెద్దకడుబూరు,ఏప్రిల్ 30,ప్రభాతవార్త :** పెద్దకడుబూరు మండల పరిధిలో చిన్నతుంబళం గ్రామంలో గత కొంతకాలంగా ఉన్న వర్గ భేదాలు బయటపడ్డాయి. మంగళవారం చిన్నతుంబళం గ్రామానికి ఎన్నికల ప్రచారం కోసం ఎమ్మెల్యే తనయుడు ప్రదీప్‌రెడ్డితో పాటు మండల నాయకులు హాజరయ్యారు. ఎస్‌సి కాలనీలో ప్రచారం చేస్తుండగా గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు కెపి ఎల్లప్ప అనుచరుడు మాజీ వాలంటరీ బ్రహ్మయ్యపై ఎస్‌సి కాలనీకి చెందిన కొంతమంది యువకులు దాడి చేశారు. ఒకరికొకరు తోపుకుంటూ కేకలు వేయడంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్‌సి కాలనీకి ఫిల్టర్ నీళ్ల ఇవ్వకుండ కొంతమందికి మాత్రమే ఇస్తుండడంపై యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బ్రహ్మయ్యను నిలదీశారు. వైసిపి నాయకుడు కెపి ఎల్లప్ప మాజీ వాలంటీర్ బ్రహ్మయ్యను అడ్డుపెట్టుకుని వైసిపిలో డ్రామాలాడుతున్నారని అతని వల్ల వైసిపికి నష్టం తప్ప లాభం లేదని ఎల్లప్ప ప్రోత్సాహంతోనే ఎస్‌సి కాలనీకి మంచినీళ్ల ఇవ్వకుండ అడ్డుపడుతున్నాడని కాలనీ యువకులు ఆరోపించారు. తమకు అన్యాయం జరిగినందుకే ఎల్లప్ప వర్గీయులను నిలదీయడం జరిగిందని భవిష్యత్తులో ఎల్లప్ప కూడా తగిన శాస్తి చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా మండల వైసిపి నేతలు ఎల్లప్పను కంట్రోల్లో పెట్టాలన్నారు. ఎస్‌సి కాలనీ యువకులు చేసి దాడిలో గొంతులో ఉన్న తన చైన్ తెగిపడిందని అది కూడా సగం దొరికింది సగం దొరకలేదని రాజకీయ దురుద్దేశంతోనే తనపై దాడి చేశారని బ్రహ్మయ్య విలేకర్ల ముందు వాపోయారు. మండల వైసిపి నేతలు పురుషోత్తంరెడ్డి,రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్ధి చెప్పి ముందుకెళ్లారు. ఎప్పటినుంచో చిన్నతుంబళం వైసిపిలో చేప కింద నీరులా ఉన్న విభేదాలు నేడు నాయకుల సాక్షిగా బయటపడ్డాయి. భవిష్యత్తులో వివాదాలు ఎక్కడ దాకా దారితీస్తాయో వేచిచూడాల్సిందేనని గ్రామంలో చర్చించుకుంటున్నారు.



## రోటరీ క్లబ్ అఫ్ నంద్యాల అధ్వర్యంలో కొనసాగుతున్న సేవల పరంపర

-నిస్వార్థంగా సేవ చేసే గుణం ఉన్న వ్యక్తి దండే దస్తగిరి



**నంద్యాల, ఏప్రిల్ 30, ప్రభాతవార్త ప్రతినిధిః** రోటరీ క్లబ్ అఫ్ నంద్యాల అధ్వర్యంలో సేవల పరంపర కొనసాగుతుంది. క్లబ్ అధ్యక్షులుగా దండే దస్తగిరి నియమించిన రోజు నుంచి ఈరోజు వరకు సేవల పరంపర కొనసాగుతుందని క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఆయన అధ్వర్యంలో గర్నమెంట్ విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకానికి సంబంధించి సుమారు నాలుగు వేల స్టీల్ ప్లేట్ల పంపిణి, నోట్ పుస్తకాల పంపిణి, దుప్పట్లు, దస్తుల పంపిణి, ఉచిత ఆపరేషన్లు, తోపుడుబండ్ల పంపిణి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తుల పంపిణి, దేవాలయాలకు సహకారం, మహిళా అధికారులకు, కవులకు సన్మానాలు ఇలా పలు రకాల సేవా కార్యక్రమాలు చేసుకుంటూ అందరి మన్ననలు పొందుతున్నారని తెలిపారు. ఆయన ఏ రంగంలో వుంటే ఆ రంగంలో నిస్వార్థంగా సేవ చేసే వ్యక్తిగా దండే దస్తగిరికి గుర్తింపు ఉంది. ఇందులో భాగంగా వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఎండలో వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు రూ.45 వేల విలువ చేసే పెద్ద గొడుగులను మార్కెట్ ఏరియా, బస్టాండ్ ఏరియా, నూనెపల్లె ఏరియా, మున్సిపాలిటి ఏరియాల్లో వున్న చిరు వ్యాపారులకు క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో అందించడం జరిగిందని క్లబ్ అధ్యక్షులు దండే దస్తగిరి తెలిపారు. పీ.డీ.జి చిన్నపురెడ్డి మాట్లాడుతూ 85 రోటరీ క్లబ్‌లలో నంద్యాల రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలలో మొదటి స్థానంలో నిలిచిందని సేవా కార్యక్రమాలు ముమ్మందు కూడ కొనసాగుతాయని తెలిపారు. గొడుగులు స్వీకరించిన చిరువ్యాపారులు రోటరీ క్లబ్ అఫ్ నంద్యాల సేవలను కొనియాడుతూ ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో మలపాటి రాజశేఖర్, ఎన్సీ మోహన్‌రెడ్డి, గోళ్ళ జై కృష్ణ, బాలకృష్ణ, విజయ శేఖర్‌రెడ్డి, కొల్లి వేణుగోపాల్, మధుసూధన్ రావు, కంటే హరినాథ్, లక్ష్మీనారాయణ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుతోనే బంగారు భవిష్యత్తు

**ఆదోని రూరల్,ఏప్రిల్ 30,ప్రభాతవార్త :** ఓటు హక్కుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని సబ్ కలెక్టర్/ఎన్నికల అధికారి శివనారాయణశర్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుండి రిలయన్స్ ట్రెండ్స్,ఎన్‌జివోస్ కాలనీ,నోబుల్ కాలేజ్, గణేష్ సర్కిల్ మీదుగా బుడ్డేకల్,హవన్నపేట, ఎంఎంరోడ్డు ,భీమాస్ సర్కిల్,మున్సిపల్ ఆఫీస్ వరకు మున్సిపల్ సెక్టరల్ అధికారులు,బిఎల్ఓలు, పోలీసులు,ఉపాధ్యాయులు,సచివాలయ సిబ్బందితో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని 18సం॥లు నిండిన ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ట్రైనీ డిఎస్పీ ధీరజ్,మున్సిపల్ కమీషనర్ రామచంద్రరెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖ అధికారుల సమావేశం




**నందికొట్కూరు,ఏప్రిల్ 30,ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా సెబ్ కమీషనర్ ఎం.రవి ప్రకాష్ మరియు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండ్ బి.రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మరియు తెలంగాణ ఎక్సైజ్‌శాఖ అధికారుల అంతరాష్ట్ర సమ న్వయ సమావేశం జరిగింది. మంగళవారం స్తానిక సత్యనారాయణ కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతు రాబోవు సాధారణ ఎన్నికల సంధర్భంగా అక్రమ మద్యం రవాణ నియంత్రణ కోసం తీసుకోవ వాల్సిన చర్యల గురించి చర్చించారు. తెలంగాణ నుండి అక్రమంగా మద్యం రవాణ కాకుండా ఇరు రాష్ట్రా అధికారులు పరస్పరం సహాక రించుకోవాలని సమాచారం మారి ్పడి చేసుకోవాలని సూచించారు. తమ పరిధిలోని చెక్ పోష్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేపట్టాలని సెబ్ సూపరింటెండ్ రాంమో హన్‌రెడ్డి తెలిపారు. నిత్యం పాత నేరస్తులపై నిఘా పెట్టాలని, అక్రమ మద్యం రవాణాకు అనుకూల మైన మార్గాలలో వాహనాలను తనిఖీలు చేయాలని ఆయన తెలిపా రు. నంద్యాల జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ కె.మణికంఠ, ఆత్మకూరు డి.యస్పీ.ఏ.శ్రీనివాసరావు, మరి యు అరుణ్‌కుమార్, శ్రీమతి గాయ త్రీ, నందికొట్కూరు సెబ్ సి.ఐ. సీతారామిరెడ్డి, ఆత్మకూరు సి.ఐ. జి.మారుతిరావు, నంద్యాల డి.టి.యఫ్. సి.ఐ.ఎస్ .విజయకుమార్, పట్టణ సి.ఐ.జి.ప్రకాష్‌కుమార్, తెలంగాణ అధికారులు పాల్గొన్నారు.